## నేడు లయన్స్ ఇంటర్‌నేషనల్ సమావేశం

మాదాపూర్, డిసెంబర్ 18: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నేడు లయన్స్ ఇంటర్‌నేషనల్ 52వ ఐఎస్ఏఎంఈ ఫోరమ్–2024 సమావేశం నిర్వహించనున్నామని.. 15 ఏండ్ల అనంతరం జరుగనున్న ఈ సమావేశానికి 20 దేశాలకు చెందిన 1600 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని గ్లోబల్ యాక్షన్ టీమ్ లీడర్, ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ ఆర్.సునీల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 12,500 లయన్స్ క్లబ్‌లలో 3.85 లక్షల మందికి పైగా సభ్యులతో లయన్స్ ఇంటర్‌నేషనల్ ఎనిమిది రాజ్యాంగ ప్రాంతాల్లో 28 శాతం మహిళా సభ్యులే ఉండటం విశేషమన్నారు. ఇందులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అత్యంత విశిష్టమైన లయన్ నాయకులు, లయన్స్ ఇంటర్‌నేషనల్ సభ్యులు, పాస్ట్ ఇంటర్‌నేషనల్ డైరక్టర్లు పాల్గొననున్నారు. ఇందులో 2025–26లో ప్రపంచానికి అధ్యక్షుడిగా నాయకత్వం వహించే భారతీయుడు, అంతర్జాతీయ మొదటి ఉపాధ్యక్షుడు ఏపీ సింగ్ హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## 21న శనీశ్వరాయ స్వామి ఆలయ వార్షికోత్సవం

దుండిగల్, డిసెంబర్ 18: గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్ కాలనీ సమీపంలోని నల్లగుట్ట శనీశ్వరాయ స్వామి ఆలయం మొదటి వార్షికోత్సవం ఈనెల 21న శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



కూకట్‌పల్లిలో ఆటో డ్రైవర్ల కష్టాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్



ఇతర ఎమ్మెల్యేలతో కలిసి ఆటోలో అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

# ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం..

- ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 18: ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని, వారి కష్టాలను పరిష్కరించేందుకు పోరాటాలు చేస్తామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు.. బుధవారం కూకట్‌పల్లి బస్‌స్టాప్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్ ఖాకీ చొక్కాలు ధరించి ఆటో డ్రైవర్లను కలుసుకుని కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవించారన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందించిడం మంచిదేనని, ఈ క్రమంలో ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆటో నడుపుతూ జీవించే డ్రైవర్లు అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు మా పోరాటాలు కొనసాగుతాయన్నారు. భవిష్యత్‌లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోని వస్తుందని దీమా వ్యక్తం చేశారు. అనంతరం వారిద్దరు కలిసి అసెంబ్లీకి తరలి వెళ్లి.. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆటో డ్రైవర్లకు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం..

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 18: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం కూకట్‌పల్లిలో బాలానగర్ డివిజన్‌కు చెందిన జె.బార్గవికి రూ.1.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.



కూకట్‌పల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

## కూకట్‌పల్లిలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్..






కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోలజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ పోటీలను నిర్వహించారు. బుధవారం నిర్వహించిన పోటీలను ఎంఈవో కిషన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి పరిశీలించారు. టాలెంట్ టెస్ట్‌లో 15 మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభను చూపిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షురాలు ఎం.కవిత, ప్రధాన కార్యదర్శి తిరుమలేశ్, ఉపాధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శులు ప్రశాంత్‌నాయక్, మల్లారెడ్డి, రమాదేవి ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 18

## వర్సిటీలో సమస్యలను పరిష్కరించాలని వీసీకి వినతి



వర్సిటీ వైస్ చాన్స్‌లర్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 18: జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ బాలకృష్ణారెడ్డికి వర్సిటీ ప్రొటెక్షన్ ఫోర్స్ విద్యార్థి సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. వర్సిటీలో చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్నా డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలన్నారు. జేఎన్‌టీయూహెచ్ మెట్రోస్టేషన్ నుంచి వర్సిటీలోకి వచ్చేందుకు ప్రత్యేక ద్వారాన్ని ఏర్పాటు చేయాలని, వర్సిటీ మెయిన్ గెట్ వద్ద రోడ్డును దాటేందుకు పుట్‌ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరారు. వర్సిటీ గోడలకు రంగులు వేయించాలని, వాటర్ ప్లాంట్‌ను బాగుచేయించాలని, నూతన వసతి గృహాలను అందుబాటులోని తేవాలన్నారు. అధ్యాపకులను నియమించుకోవాలని, బయట వ్యక్తుల జోక్యాన్ని తగ్గించి అసాంఘిక కార్యకలపాలకు చమరగీతం పాడాలన్నారు. వర్సిటీలో చదువుకునే విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరనాన్ని కల్పించాలని కోరారు. ఈ అంశాలపై వీసీ సానుకులంగా స్పందించినట్లు విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు అరవింద్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, దుర్గా ప్రసాద్, ధనుంజయ్, హేమంత్, ఆనంద్, గౌతమ్, దిలీప్ తదితరులు ఉన్నారు.



జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ బాలకృష్ణరెడ్డికి శుభాకాంక్షలు

జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టిన వి.బాలకృష్ణారెడ్డికి వర్సిటీ కాంట్రాక్ట్ ప్రొఫెసర్స్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌కు సంబంధిన పలు సమస్యలను వివరించి... ఆ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధ్యక్షుడు సురేశ్‌నాయక్, జనరల్ సెక్రటరీ శివారెడ్డి, శంకర్, దశరథం, వంశీకృష్ణారెడ్డి, కళ్యాణి, బాలకృష్ణ, అంజుమ్‌పాషా ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 18

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: ఏసీపీ



కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు



కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 18: ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహక కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్ ఉపయోగించినప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అపరిచితలు లింక్‌లను ఓపెన్ చేయవద్దని కోరారు. ఫోన్‌లో ట్రూ కాలర్‌ను తొలగించుకోవాని, ఈ యాప్ ద్వారా మన వ్యక్తిగత సమాచారానికి భద్రత ఉండదన్నారు. అన్‌లైన్‌లో బ్యాంకు లావాదేవిలు నిర్వహించడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా ఆన్‌లైన్ మోసం జరిగితే... 24 గంటల లోపు.. 1930కు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమలో కూకట్‌పల్లి సీఐ ముత్తు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి




విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేందర్

దుండిగల్, డిసెంబర్ 18: సైబర్‌నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని బాచుపల్లి సీఐ జే.ఉపేందర్ తెలిపారు. బుధవారం సాయంత్రం బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి మేనేజ్‌మెంట్(వీజేఐఎం) కళాశాలలో బుధవారం సాయంత్రం సైబర్‌నేరాలపై విద్యార్థులకు సైబర్‌పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ ఉపేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల సైబర్‌నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వీటిపై విద్యార్థులతో సహా ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌లు ఇతర మాధ్యమాల్లో వచ్చే అనుమానాస్పద, తెలియని లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. పార్సిల్స్, డ్రగ్స్ పేరుతో పాటు డిజిటల్ అరెస్ట్‌పేరుతో సైబర్ నేరస్తులు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. బయపడి ఎవరు తమవివరాలతో పాటు బ్యాంక్‌ల వివరాలు చెప్పొద్దన్నారు. ఏదైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులతో పాటు అధ్యాపకులు, పోలీసులు తెలిపారు.



దుండిగల్ తండా–1లో కొర్ర శివనాయక్ (కన్నెస్వామి) ఆధ్వర్యంలో బుధవారం జరిగిన అయ్యప్ప స్వామి పడిపూజలో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో 27వ వార్డు కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్, 27వ వార్డు బీఆర్ఎస్ ప్రెసిడెంట్ అమర్‌సింగ్, సీనియర్ నాయకులు కొర్ర రవినాయక్, బౌరంపేట్ పీఏసీఎస్ డైరెక్టర్ మోహన్ నాయక్, హనుమంత్ నాయక్, ప్రవీణ్ నాయక్, కుమార్ నాయక్, సోను, స్థానిక నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలదారులు పాల్గొన్నారు. – దుండిగల్, డిసెంబర్ 18

## భవనం పైనుంచి పడి కార్మికుడికి గాయాలు..

### రూ.8 లక్షల పరిహారం ఇప్పించిన సీఐటీయూ...



చికిత్స పొందుతున్న గైక్వాడ్ బాలాజీని పరామర్శిస్తున్న సీపీఎం నాయకుడు లక్ష్మణ్

దుండిగల్, డిసెంబర్ 18: నిర్మాణంలో ఉన్న భవనం నాలుగో అంతస్తుపై నుంచి కిందపడి తీవ్రగాయాలపాలైన కార్మికుడికి సీఐటీయూ నాయకులు భవన యజమాని నుంచి రూ.8లక్షల పరిహారం ఇప్పించారు. గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన గైక్వాడ్ బాలాజీ సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తూ విధి నిర్వహణలో భాగంగా నిజాంపేట్ కార్పొరేషన్ శ్రీనివాసనగర్ కాలనీలో రెండు రోజుల క్రితం నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ నాలుగో అంతస్తులో సెంట్రింగ్ చెక్క కొడుతూ ప్రమాదవశాత్తు కిందపడటంతో రెండు కాళ్లు, వెన్నుపూస విరిగింది. ఇంటి యజమాని వెంకట్‌రెడ్డి నిజాంపేట్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పించి.. ఒక్క రోజు వైద్యఖర్చులు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకొన్నాడు. దీంతో హాస్పిటల్ యాజమాన్యం రోగిని వెంటనే తీసుకెళ్లాలని ఒత్తిడి తీసుకురాగా.. దిక్కుతోచని సెంట్రింగ్ కార్మికుడి కుటుంబ సభ్యులు సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల నాయకులను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని తెలియజేశారు. దీంతో కుటుంబ సభ్యులతో కలిసి సీఐటీయూ నాయకులు హాస్పిటల్‌కు చేరుకొని భవన యజమానితో చర్చించి పరిహారంగా రూ.5లక్షలు, వైద్యఖర్చుల నిమిత్తం మరో రూ.3లక్షలు కుటుంబ సభ్యులకు ఇప్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్, నాయకులు పసుల అంజయ్య, జిల్లా నాయకులు ఐలాపురం, రాజశేఖర్, శంకర్, చంద్రశేఖర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్‌లో సామూహిక సీమంతాలు



ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ వార్డు కార్యాలయ ప్రాగంణంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. బుధవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి వార్డు కార్యాలయ ప్రాంగణంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పలువురుయ గర్భిణీలకు సామూహి శ్రీమంతాలు నిర్వహించారు. డాక్టర్ దీప్తి, సీవో మహిపాల్‌రెడ్డి, ఏఎన్ఎం స్వరూప, పద్మ, ఐసీడీఎస్ సైపర్ వైజర్ స్వరూప, ధనలక్ష్మి, స్వప్న, ఐకేపీవీవో సునిత, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు. – బాలానగర్, డిసెంబర్ 18

## ఫుట్‌పాత్ పునరుద్ధరణ

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 18: జీడిమెట్ల డివిజన్ సరోజినీ గార్డెన్‌లో ప్రభుత్వ స్థలం కబ్జాపై నమస్తే తెలంగాణలో ఇటీవల ప్రచురితమైన కథనానికి అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు, ఎన్‌హెచ్–44 అధికారులు స్పందించారు. ఎలాంటి అనుమతులు లేకుండా సరోజినీ గార్డెన్‌లో నిర్మించతలపెట్టిన బహుళ అతస్తుల నిర్మాణ స్థలానికి లారీలు, టిప్పర్ల రాకపోకలకు సాగించేందుకు నిర్మాణ సంస్థ నిర్వాహకులు అనాధికారికంగా ఫుట్‌పాత్‌ను తవ్వేశారు. దీంతో ఆయా శాఖల అధికారులు స్పందించి తొలగించిన ఫుట్‌పాత్ ప్రాంతంలో దిమ్మెలను ఏర్పాటు చేసి దారి మూసివేశారు.

**CHANGE OF NAME**
"I, KAMALNATH SHIV KARTHIKEYAN, S/o. Shri Bhogaraju Smitha, Flat No. 816, SMR Vinay Hi Lands, Miyapur, Hyderabad-500 049, have Changed My Name to B SHIV KARTHIKEYAN for all future purposes."

## రోడ్డు తవ్విన వ్యక్తులపై కేసు నమోదు

దుండిగల్, డిసెంబర్ 18: అనుమతులు లేకుండా రోడ్డును తవ్విన వ్యక్తులపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బౌరంపేట్‌లోని డీఆర్‌కే కళాశాల నుంచి బౌరంపేట్ విలేజ్ వరకు 40ఫీట్ల రోడ్డును తమ వ్యవసాయ భూమిల్లోకి వస్తుందంటూ గ్రామానికి చెందిన సీహెచ్ రాంరెడ్డి, సీహెచ్ మహిపాల్‌రెడ్డి ఈనెల15 తవ్వేశారు. అయితే కొన్నేండ్లుగా ఉన్న రోడ్డును తవ్వేయడంతో గ్రామానికి చెందిన కొందరు రైతులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డు తవ్విన రాంరెడ్డి, మహిపాల్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీకృష్ణ వైన్స్‌పై చర్యలు తీసుకోవాలి



బాలానగర్ ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 18: మూసాపేట జనతానగర్‌లో కొనసాగుతున్న శ్రీ కృష్ణ వైన్స్‌తో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నిబంధలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వైన్స్‌షాప్‌ను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని మూసాపేటకు చెందిన నవయువక అసోసియేషన్ సభ్యులు బాలానగర్ ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గత నెలలోనే బాలానగర్ ఎక్సైజ్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా.. అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. వైన్స్‌షాప్‌లో నిబంధనలు పాటించడం లేదని, పర్మిట్ రూంలో కాకుండా పక్కనున్న ఇంటిని పర్మిట్ రూంగా మార్చారన్నారు. దీంతో పక్కనున్న ఇండ్లతో పాటూ.. ఆ మార్గంలో రాకపోకలు సాగించే మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్సైజ్ ఆఫీసర్లకు ప్రజల కష్టాలు పట్టడం లేదని, వైన్స్‌షాప్ నిర్వాహకులతో లాలూచి పడి.. మామూళ్ల మత్తులో మునిగి.. ప్రజల ఫిర్యాదులపై స్పందించడం లేదన్నారు. వైన్స్‌షాప్‌పై చర్యలు తీసుకోకపోతే... ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, వైన్స్‌షాపు ఎదుటే ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



## ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని బాలానగర్ సీఐ నర్సింహరాజు పేర్కొన్నారు. బుధవారం బాలానగర్ డివిజన్ పరిధి రాజుకాలనీ కమ్యూనిటీహాల్‌లో పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు. తప్పనిసరిగా ప్రార్థనా మందిరాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకుకోవాలని సూచించారు. – బాలానగర్, డిసెంబర్ 18

## గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

దుండిగల్, డిసెంబర్ 18: గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ పరిధిలోని లాల్‌సాబ్‌గూడ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ గుర్తుతెలియని యువకుడు చెట్టుకు ఉరేసుకొని వేలాడుతున్నట్లు పోలీసులకు బుధవారం రాత్రి సమాచారం అందింది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. చీకటిపడటంతో మృతుడి వివరాలు తెలియరాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అక్రమ నిర్మాణాల జోరు..

- గాజులరామారం సర్కిల్ పరిధిలో ఇష్టారీతిన నిర్మాణాలు
- అనుమతులు లేకుండానే సెల్లార్లు, షెడ్ల నిర్మాణం
- ప్రభుత్వ ఆధాయానికి భారీగా గండి
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు.



గాజులరామారం విలేజ్ సమీపంలో అనుమతులు లేకుండా వెలుస్తున్న షెడ్డు



సూరారం మెయిన్‌రోడ్డులో సెల్లార్‌తో కూడిన అక్రమ వాణిజ్య సముదాయం

దుండిగల్, డిసెంబర్ 18: గాజులరామారం సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. పైగా అక్రమ నిర్మాణాలను నియంత్రించడం తమపని కాదంటూ స్వయంగా సెక్షన్ అధికారే సెలవియ్యడంతో విచ్చలవిడిగా అనుమతులు లేని నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే కొన్ని నిర్మాణాలు జరుగుతుండగా.. నామమాత్రపు అనుమతులు తీసుకున్న మరికొందరు ఇష్టారీతిలో బహుళ అంతస్తులతో పాటు సెల్లార్లను నిర్మిస్తున్నారు. ఇక హెచ్ఎండీఏ నుంచి అనుమతులు తీసుకుని నిర్మించాల్సిన షెడ్లు యజమానులు జీహెచ్ఎంసీ అధికారులు సహకరిస్తుండగా తమకుందుకు అనుమతులు అనేలా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం, సూరారం డివిజన్‌లల్లో ఇటీవల సెల్లార్లు, షెడ్లు నిర్మాణాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయంటున్నారు స్థానికులు. సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులను మచ్చిక చేసుకుంటున్న నిర్మాణదారులు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారని ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు 'అది మా పని కాదు' బాహటంగా చెప్పడంలోని సారంశం ఇదే అంటున్నారు ప్రజలు. ప్రభుత్వానికి దక్కాల్సిన ఆదాయం తమ జేబులు నింపుకోవడంలో ఉన్న శ్రద్ధ అక్రమాలను నిరోధించడంలో ఎందుకు చూపడం లేదంటున్నారు. అధికారులు,సిబ్బంది తీరుతోనే గాజులరామారం సర్కిల్ పరిధిలో అనుమతిలేని నిర్మాణాలు విచ్చలవిడిగా జరుగుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి అక్రమనిర్మాణాలను నిరోధించాలని కోరుతున్నారు.